క్లుప్తంగా

నేడు 'అన్నదాత పోరు'



మల్లం రవిచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి మీడియాకు తెలిపారు. మంగళవారం ఉదయం 9.45గంటలకు అన్నమయ్య సర్కిల్ నుంచి రైతులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

15లోపు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయండి



రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీపై సమీక్షిస్తున్న తహసీల్దార్

చంద్రగిరి: నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఈ నెల 15వ తేదీ లోపు పంపిణీ పూర్తి చేయాలని తహసీల్దార్ శివరామసుబ్బయ్య ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ రేషన్ షాపుల డీలర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమీక్షించారు. చంద్రగిరిలోని రేషన్ దుకాణాలలో ఇప్పటివరకు 70 శాతం మాత్రమే నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారని ఆయన చెప్పారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న వర్సిటీ వీసీ

తిరుపతి రూరల్: ఇటీవలే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన శ్రీ పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయానికి చెందిన వివిధ విభాగాల ఆచార్యులను వర్సిటీలో సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ వైఎస్. శారద (ఇంగ్లిష్ విభాగం), ప్రొఫెసర్ ఎం.అరుణ (హోమ్ సైన్స్), ప్రొఫెసర్ పి.జ్యోత్స్న (బయో టెక్నాలజీ), ప్రొఫెసర్ పి.వెంకటకృష్ణ (కంప్యూటర్ సైన్స్), ప్రొఫెసర్ బి.రమ్య కుబేర్ (ఫార్మాస్యూటికల్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్)లను ఉపకులపతి వి.ఉమ, రిజిస్ట్రార్ రజని, పలువురు వర్సిటీ అధికారులు, అధ్యాపకులు సత్కరించి అభినందించారు.

ముగిసిన ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ వర్క్ షాప్



శిక్షణ కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ ప్రతినిధులు, శిక్షకులు

తిరుపతి సిటీ: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ రీజినల్ ప్రెసిడెంట్ తహసున్నీసా బేగం ఆధ్వర్యంలో స్థానిక ఓ హోటల్‌లో రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాపు సోమవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా ఆ సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ మాధవి హాజరయ్యారు. 25మంది ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్లకు లీడర్‌షిప్ క్వాలిటీస్‌తో పాటు బిజినెస్ డెవలప్‌మెంట్, మెలకువలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ రామచంద్రుడు, ఇంపాక్ట్ ప్రతినిధులు లక్ష్మీ ప్రసన్న కుమార్, నాగేశ్వర్‌రావు, ధనుంజయ, సునీల్ నాయక్, ప్రసాద్, అనితా రెడ్డి, మాధవి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తిరుపతి తుడా: స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాల కంటి వైద్య విభాగం 15రోజులుగా నిర్వహించిన నేత్రదాన పక్షోత్సవాలు సోమవారం ముగిశాయి. స్విమ్స్, రుయా, అరవింద్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ అనంతరం కంటి వైద్య విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్ కుమార్ మాట్లాడారు. దేశంలో అంధత్వంతో బాధ పడుతున్న వారికి నేత్రదానంతో వెలుగులు నింపవచ్చని, నేత్రదానంతో మరణాంతరం మరొకరికి చూపు ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సాయిశిల్ప, శ్రావ్య, తేజస్విని, అర్జున్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ మరుగుదొడ్లను సీజ్ చేయండి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలో ఓ మరుగుదొడ్డి నిర్వాహకులు ప్రయాణికుల నుంచి రెట్టింపు నగదు వసూలు చేస్తున్న నేపథ్యంలో సీజ్ చేయాలని డీపీటీఓ జగదీష్ ఆదేశించారు. సోమవారం ఆయన తిరుపతి బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఓ మరుగుదొడ్డి నిర్వాహకులు నిర్దేశించిన రుసుం కన్నా ఎక్కువ వసూలు చేయడాన్ని గుర్తించారు. అదే విషయాన్ని ప్రయాణికులు చెప్పడంతో తక్షణ చర్యలకు ఉపక్రమించారు.

వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్, ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ సోమవారం స్థానిక ఎమ్మార్‌పల్లె కూడలిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేశారు. రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల పీపీపీ విధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభ గల, పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ వైద్య కళాశాలలు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. దీని పై రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వినయ్, ఓంరాజు, మోహన్, నాయకులు గ్రేస్, హరీష్, అఖిల్, బాలాజి, హర్ష, రమణ, సుమంత్, శంకర్ పాల్గొన్నారు

రాజారావు ఆశయాలను కొనసాగిద్దాం



నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్య మండలి, ప్రజాసంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: ప్రముఖ ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా కళాకారులందరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం డాక్టర్ గరికపాటి రాజారావు 62వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ, రాజారావు సమాజంలో పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలు, నిరుద్యోగం, నిరక్షరాస్యత..ఇత్యాది అంశాలను రూపుమాపడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఏపీ ప్రజానాట్య మండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన ప్రముఖ రచయిత, కళాకారుడు, దర్శకుడిగా పుట్టిల్లు సినిమాతో ఎందరో కళాకారులను సినిమా రంగానికి పరిచయం చేసి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దారని పలువురు సినీ నటులను ఉదహరించారు. ప్రజానాట్యమండలి ప్రతి గుండె ప్రతిధ్వని అంటూ సమాజాన్ని జాగృతం చేసేందుకు చేసిన కృషి అమోఘమన్నారు. అలాగే ఎన్నో నాటక ప్రదర్శనలతో సమాజంలో మార్పు కోసం కృషి చేసిన ప్రజా వైద్యుడని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, ప్రజానాట్య మండలి జిల్లా కోశాధికారి బి.నాగభూషణం, వివిధ ప్రజా సంఘాల నేతలు ఉదయ్‌కుమార్, ప్రవీణ్ ,నవీన్, మంజుల, మహేంద్ర, జనార్ధన్, పార్వతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



పద్మనాభం



గుణశేఖర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సీఐటీయూ అనుబంధం) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవాధ్యక్షులుగా జి.వెంకటేశం, గౌరవ సలహాదారుగా కేఎస్ఎన్.ప్రసాదరావు అధ్యక్షుడిగా ఎన్.పద్మనాభం, ప్రధాన కార్యదర్శిగా కాటా గుణశేఖర్, కోశాధికారిగా పి.రాము ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూజారి రత్న ప్రభాకర్, వి.వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఏ.నరేష్, టి.శ్రీనివాసులు, ఆర్.వేణుగోపాల్ ఉపాధ్యక్షులుగా ఏ.నాగరత్నం, డి.యుగేందర్‌రావు, బి.హనుమంత్ రెడ్డి, పట్నం దయాకర్, డి.రవి కుమార్, ఎం.మురళి, కే.శ్రీనివాసులు, డి.చంద్రా నాయక్, జాయింట్ సెక్రటరీలుగా బి.సుబ్రహ్మణ్యం, ఎస్.వెంకట మునిరాజు, పి.రాజశేఖర్, వి.ముని కిరణ్‌కుమార్, బాలాజీ, ఎం.శివయ్య, ఏ.మురళీమోహన్, మహిళా కార్యదర్శులుగా జి శ్రీలక్ష్మి, వి.ఆదిలక్ష్మి, వై.ప్రతిభా భారతి, కార్యవర్గ సభ్యులుగా మరో 20మందిని ఎన్నుకున్నారు.

గ్రామాల్లో సమస్యలపై అవగాహనకు..!



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, విభాగాధిపతి

తిరుపతి సిటీ: ఎస్వీయూ సాంఘిక శాస్త్ర విభాగం పీజీ విద్యార్థుల కోసం గ్రామీణ విస్తరణ కార్యక్రమాన్ని రామచంద్రాపురం మండలంలో నిర్వహించింది. తొలుత ప్రకాశం భవన్ నుంచి అధ్యాపకులు, విద్యార్థులతో బయల్దేరిన ప్రత్యేక వాహనానికి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి, సామాజిక శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ జానకిరామయ్య జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. పది గ్రామాల్లో సామాజిక సమస్యలపై అవగాహన పెంచడం, డేటా సేకరించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఏ. కుసుమ, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల, బర్డ్ హాస్పిటల్ సంయుక్తంగా పద్మావతి ఆడిటోరియంలో సోమవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. వృద్ధాప్యంలో ఆరోగ్యకరంగా ఉండేందుకు పోషకాహారం, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. వాకింగ్, గార్డెనింగ్ వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కే.మాధవి, డాక్టర్ సుధారాణి, విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరి, బర్డ్ హాస్పిటల్ డాక్టర్ రాజేంద్ర, వైద్యులు పాల్గొన్నారు

గురువులే దేశ నిర్మాణ శిల్పులు



అధ్యాపకులతో ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. 40మంది అధ్యాపకులను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ, గురువులు దేశ నిర్మాణ శిల్పులని అభివర్ణించారు. ఉపాధ్యాయ వృత్తి భావి భారత పౌరులను తీర్చిదిద్దే మహోన్నతమైన వృత్తి అని అన్నారు. కాగా, ప్రిన్సిపాల్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు పొందిన నేపథ్యంలో ఆమెను అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

తంబువాని గుంట మున్సిపల్ స్కూల్‌లో...

స్థానిక 45వ డివిజన్‌లోని శివజ్యోతి నగర్ తంబువానిగుంట మున్సిపల్ స్కూల్‌లో కమిటీ చైర్మన్ కదిరి రాజేంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. టీచర్లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. దాసన్న, మనీషా గుప్తా, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



తంబువానిగుంట మున్సిపల్ స్కూల్‌లో..

మందుబాబులకు జైలు, జరిమానా

తిరుపతి లీగల్ : అధిక మొత్తంలో మద్యం సేవించి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 9 మందికి జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. శిక్ష పడిన 9 మందిలో ఒకరికి 4 రోజులు, ఇద్దరికి 2 రోజులు, ఆరుగురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్షతోపాటు అందరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన13 మందికి కూడా అదే స్థాయిలో జరిమానా విధించారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఆహార పదార్థాలు వృథా చేయొద్దు



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలోని అన్నా క్యాంటీన్లలో ఆహార పదార్థాలను వృథా చేయరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలను కోరారు. నగరంలోని న్యూ బాలాజీ కాలనీలోని అన్నా క్యాంటీన్‌ను సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ప్రజలకు ఇస్తున్న టోకెన్లు పరిశీలించి ఆమె మాట్లాడారు. ఆహార పదార్థాలను తగినంత వడ్డించి, వృథాను అరికట్టాలని, క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహార పదార్థాల జాబితా, క్యాంటీన్ అందుబాటులో ఉండే వాటి వివరాలతో కూడిన బోర్డులు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని అన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు



సమస్యలను కమిషనర్‌కు నివేదిస్తున్న కార్పొరేటర్ పునిత

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 21 మంది నేరుగా, తొమ్మిది మంది ఫోన్‌లో సమస్యలు నివేదించారు. చెన్నారెడ్డి కాలనీ శ్మశానంలోని మరమ్మత్తులు చేయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ పునీత కోరారు. ఆయా ఫిర్యాదులను వివిధ విభాగాల అధికారులు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పాకాల: స్థానిక న్యూ కాలనీ, భారతంమిట్టలో కోర్ ఎన్జీఓ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై పీర్ ఎడ్యుకేటర్ తయ్యూరు బాలాజి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో అవగాహన కల్పించారు. బాలాజి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన కలి ఉండాలని కోరారు. హెచ్ఐవీ ఏ రకంగా సంక్రమిస్తుంది? దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పీఎం సద్దాం, హెల్త్ వర్కర్ రాజేశ్వరి, ఔట్ రీచ్ వర్కర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ ఆక్రమణదారులను అరెస్టు చేయాలని ధర్నా

తిరుపతి రూరల్ : మండలంలోని వేదాంతపురం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 214లో రజకులకు ఇచ్చిన దోబీఘాట్ స్థలాన్ని ఆక్రమించిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు రజకులతో కలిసి ధర్నా చేశారు. సీపీఎం తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్, జిల్లా నాయకులు జయచంద్ర, అశోక్ మాట్లాడారు. వేదాంతపురానికి చెందిన టీడీపీ నేతలు చిరంజీవి రెడ్డి, చంద్ర ముదిరాజ్, రవిరెడ్డి రజక సంఘంలోనే ఉన్న ఇద్దరి వ్యక్తులతో కుమ్మక్కై సుమారు రూ.10 కోట్ల విలువచేసే దోబీఘాట్ స్థలాన్ని కబ్జా చేసి, ఇళ్ల నిర్మాణం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అనంతరం ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి రూరల్ తహసీల్దార్ రామాంజుల నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నేతలు విజయ్, శివ, సురేష్, రాజారాం, రజక కుటుంబీకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కిరణ్ కుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి బొంగాని కిరణ్ కుమార్‌కు ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రొఫెసర్ బి.దేవప్రసాద్ రాజు పర్యవేక్షణలో 'ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం, నియోడియం అండ్ ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్'అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

వారానికోసారి వచ్చి..కనిపించి వెళ్లండి!

–రౌడీషీటర్లకు ఈస్ట్ సీఐ కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఈస్ట్ సీఐ శ్రీనివాసులు

తిరుపతి క్రైమ్: తీరు మారకపోతే రౌడీషీటర్లకు నగర బహిష్కరణ తప్పదని ఈస్ట్ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో 20 మంది రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లంతా సన్మార్గంలో నడవాలని హితోక్తులు పలికారు. మేమింతే ..అనే లెవెల్లో తీరు మారకపోతే మాత్రం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని హెచ్చరించారు. నగరంలో ఎక్కడైనా గొడవలు చోటు చేసుకుంటే తొలుత అనుమానించేది రౌడీషీటర్లనేనని, ఆ స్థితి నుంచి బయటపడాలన్నారు. వారానికోసారి పోలీస్ స్టేషన్‌కు వచ్చి కనిపించి వెళ్లాలన్నారు. అనంతరం వారిని తహసీల్దార్ వద్ద హాజరు పరిచారు.

ఎరువులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం



యూరియా కొరతపై ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

చంద్రగిరి: రైతులకు సకాలంలో ఎరువులు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు మండిపడ్డారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో భీమవరం, కొంగరవారిపల్లె, గంగిరెడ్డిపల్లె, శానంబట్ల, కొటాల, ఐతేపల్లెలో ఎరువులు సకాలంలో అందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరికి మాత్రమే యూరియా బస్తాలు ముందే ఇచ్చి మిగిలిన రైతులకు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రైతన్నలు విధిలేక ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు కొనాల్సిన దుస్థితి కలిగిందని, దీనికి ప్రభుత్వం అలసత్వమే కారణమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవై రాజా, పార్వతి, గీత, కళావతి, బాలకృష్ణ, ఫయాజ్, నారాయణబాబు పాల్గొన్నారు.

గ్రహణం వీడె..దర్శనమాయె..!



అమ్మవారి ఆలయాన్ని తెరుస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

చంద్రగిరి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని టీటీడీ అధికారులు మూసివేశారు. గ్రహణం వీడిన అనంతరం సోమవారం తెల్లవారుజామున 3.49 గంటలకు టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు ఆలయాన్ని తెరచి ఆలయశుద్ధి, సంప్రోక్షణ అనంతరం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

